జైస్వాల్ @ 15

దుబాయ్: భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టు ర్యాంకింగ్స్‌లో సత్తాచాటాడు. బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో జైస్వాల్ 14ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 15వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుస మ్యాచ్‌ల్లో డబుల్ సెంచరీలు బాదడం ద్వారా జైస్వాల్ (699 పాయింట్లు) తన ర్యాంకింగ్‌ను మరింత మెరుగుపర్చుకున్నాడు. కోహ్లీ (752) ఏడో ర్యాంక్‌లో ఉండగా, రోహిత్‌శర్మ (731) 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో జడేజా (789) 6వ ర్యాంక్‌లో నిలిచాడు.

యూఏఈ కోచ్‌గా లాల్‌చంద్

దుబాయ్: యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఈఏ) నూతన కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ ఎంపిక య్యాడు. పాకిస్థాన్‌కు చెందిన ముదాస్సర్ నాజర్‌ను కోచ్ పదవి నుంచి తప్పించిన యూఏఈ క్రికెట్ బోర్డు రాజ్‌పుత్‌తో మూడేండ్ల పాటు ఒప్పందం కుదుర్చుకుంది. యూఏఈ వేదికగా ఈ నెల 28వ తేదీ నుంచి మొదలయ్యే ఐసీసీ క్రికెట్ ప్రపంచకప్ లీగ్-2 ట్రై సిరీస్ ద్వారా రాజ్‌పుత్ కొత్త బాధ్యతలు తీసుకోనున్నాడు. ఈ టోర్నీలో ఆతిథ్య యూఏఈ, స్కాట్లాండ్, కెనడా జట్లు బరిలోకి దిగుతున్నాయి.

భారత్‌కు స్వర్ణం

ఏషియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఏషియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత సైక్లిస్టులు పతక దూకుడు కనబరుస్తున్నారు. బుధవారం జరిగిన మహిళల జూనియర్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణం దక్కింది. సరితా కుమారి, నియా సెబాస్టియన్, జైనా మహమ్మద్‌తో కూడిన భారత త్రయం 53.383సెకన్ల టైమింగ్‌తో పసిడి ఖాతాలో వేసుకుంది. మరోవైపు పారా టీమ్ స్ప్రింట్ ఈవెంట్ అర్షద్ షేఖ్, జలాలుద్దీన్ అన్సారీ, బసవరాజ్‌తో కూడిన బృందం రజతం దక్కించుకుంది.

అంచనాలతో నిరాశ

మూడో స్థానంలో బ్యాటింగ్ కష్టం • మన పేసర్లది అద్భుత ప్రదర్శన • మీడియాతో శుభ్‌మన్ గిల్

టీమ్‌ఇండియా యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ తన ప్రాధాన్యాలు ఏంటో స్పష్టం చేశాడు. ఇంగ్లండ్‌తో సిరీస్ ముందు వరకు ఫామ్‌లేమితో ఇబ్బంది పడ్డ గిల్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. టెక్నిక్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న గిల్..అంచనాలు అందుకోవడంలో విఫలమయ్యాడు. వైజాగ్ టెస్టులో సెంచరీతో టచ్‌లోకి వచ్చిన గిల్ రాజ్‌కోట్ పోరులో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తద్వారా తనపై నెలకొన్న ఒత్తిడిని దూరం చేసుకునే ప్రయత్నం చేశాడు. శుక్రవారం నుంచి రాంచీ వేదికగా ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు నేపథ్యంలో గిల్ మీడియాతో మాట్లాడాడు.

రాంచీ: భారత యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్..తనపై పెట్టుకున్న అంచనాలను అందుకోలేకపోయానని అన్నాడు. ఇది ఒకింత నిరాశ కల్గించిందని చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు మ్యాచ్ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గిల్ పలు అంశాలపై మాట్లాడాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో మొదట్లో ఘోరంగా విఫలమైన గిల్..విశాఖపట్నం, రాజ్‌కోట్ టెస్టుల ద్వారా తన సత్తాచాటాడు. హైదరాబాద్ టెస్టులో నిరాశపరిచిన ఈ పంజాబ్ క్రికెటర్..విశాఖపట్నంలో జరిగిన రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ధనాధన్ సెంచరీతో తనపై వస్తున్న విమర్శలకు పుల్‌స్టాప్ పెట్టాడు. అప్పటి వరకు ఇంటాబయటా ఒత్తిడి ఎదుర్కొన్న గిల్..సెంచరీతో గాడిలో పడ్డాడు. అదే దూకుడు రాజ్‌కోట్ టెస్టు లోనూ ప్రదర్శిస్తూ రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. కెరీర్ తొలి రోజుల్లో ఓపెనర్‌గా వ్యవహరించిన గిల్..అటు తర్వాత మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇన్ని రోజులు మూడో నంబర్‌లో వచ్చిన విరాట్ కోహ్లీని నాలుగుకు పరిమితం చేస్తూ గిల్ ప్రమోషన్ పొందాడు. ఇంగ్లండ్‌తో ముగిసిన మూడు టెస్టుల్లో 42 సగటుతో 252 పరుగులతో కొనసాగుతున్నాడు.

మూడులో కష్టం..

ఇన్నింగ్స్‌కు ఇరుసులా భావించే మూడో నంబర్‌లో బ్యాటింగ్ చేయడం కష్టంతో కూడుకున్న పని. ఇన్ని రోజులు ఓపెనర్‌గా దిగినప్పుడు ఎలాంటి సమస్య ఎదుర్కొలేదు. ఎందుకంటే ఆలోచన లేకుండా బ్యాటింగ్‌కు వచ్చేవాడిని. అయితే టెస్టుల్లో మూడో నంబర్ అనేది చాలా కీలకం. దేశవాళీ క్రికెట్‌లో మూడులో బ్యాటింగ్ చేసిన అనుభవముంది. కానీ అంతర్జాతీయ స్థాయిలో ఇది నాకు కొత్త. ఆదిలోనే వికెట్లు పడిపోతే ఇన్నింగ్స్‌ను చక్కదిద్దడం. లేకపోతే పరిస్థితులు తగ్గట్లు బ్యాటింగ్ తీరు మార్చుకోవాల్సి వస్తుంది. వెంటవెంటనే వికెట్లు పడితే ఇన్నింగ్స్‌ను నిర్మించాల్సి ఉంటుంది. వైజాగ్, రాజ్‌కోట్ టెస్టులే ఇందుకు నిదర్శనం. మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలిచి ప్రత్యర్థిపై ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తాను. దీనిపై టీమ్ డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చ జరుగుతుంది.

సిరీస్‌లో పేసర్లదే హవా:

మామూలుగా స్వదేశంలో టెస్టు సిరీస్ అంటే స్పిన్నర్లదే ఎక్కువ ప్రభావం ఉంటుంది. కానీ ఈసారి ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో స్పిన్నర్ల కంటే పేసర్లు తమ హవా ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా యార్కర్ స్పెషలిస్టు బుమ్రా కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. వైజాగ్ టెస్టులో రివర్స్ స్వింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటర్ల నడ్డివిరిచాడు. స్పిన్ పిచ్‌లపై రివర్స్ స్వింగ్ రాబడుతూ ఇంగ్లండ్‌ను దెబ్బతీయడంలో కీలకమయ్యాడు. నలుగురు స్పిన్నర్లు కలిసి 36 వికెట్లు తీస్తే..పేసర్లు 22 వికెట్లు పడగొట్టారు. పేసర్ల అద్భుత ప్రదర్శనకు ఇదే నిదర్శనం. సాధారణంగా టెస్టుల్లో అశ్విన్, జడేజా పోటీపడి వికెట్లు తీస్తారు. ఈసారి బుమ్రా, సిరాజ్ వికెట్ల వేట కొనసాగిస్తున్నారు. రాంచీ టెస్టుకు బుమ్రా లేకపోయినా..ఆ స్థానాన్ని సిరాజ్ భర్తీ చేయగలడు. ముకేశ్‌కుమార్, అక్షదీప్ ముందుకు నడిపించగలరు. సీనియర్ క్రికెటర్లు కోహ్లీ, రాహుల్, షమీ గైర్హాజరీలో యువ క్రికెటర్లు సత్తా చాటేందుకు ఇది మంచి అవకాశం. అద్భుత ప్రతిభ వల్లే యశస్వి జైస్వాల్ వరుసగా రెండు టెస్టుల్లో డబుల్ సెంచరీలతో విజృంభించాడు. రానున్న మ్యాచ్‌ల్లో ఇదే జోరు కొనసాగిస్తాడన్న నమ్మకం నాకుందని గిల్ అన్నాడు.

నిహార్ పసిడి ధమాకా

ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గువాహటి వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రాష్ట్ర యువ సైక్లిస్ట్ సాయి నిహార్ బిక్కిన అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. బుధవారం జరిగిన పురుషుల 400మీటర్ల మెడ్లే ఈవెంట్‌లో నిహార్ పసిడి పతకంతో మెరిశాడు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరును నిహార్(కేఎల్ఈఎఫ్ యూనివర్సిటీ) 4:45:01 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. మణికంఠ(జైన్ యూనివర్సిటీ), ఆర్యన్ భోంస్లే(యూనివర్సిటీ ఆఫ్ ముంబై) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇది వరకే టోర్నీలో స్వర్ణం సొంతం చేసుకున్న నిహార్ రెండు రజత పతకాలు ఖాతాలో వేసుకున్నాడు.

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ దేశ సరిహద్దుల్లో పర్యటిస్తున్నాడు. బుధవారం బారాముల్లాలోని యురీలో ఉన్న అమన్‌సేత్ వారధిని తన భార్య అంజలి, కూతురు సారాతో కలిసి సచిన్ వీక్షించాడు. ఆర్మీ అధికారులు వెంబడి రాగా కొద్దిసేపు సచిన్ సరిహద్దు పరిసరాల్లో గడిపాడు.

మిచెల్ మెరుపులు

ఆఖరి బంతికి ఆసీస్ విజయం

మార్ష్ (72)

వెల్లింగ్టన్: ఆఖరి బంతి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో న్యూజిలాండ్‌పై ఆస్ట్రేలియాదే పైచేయి అయ్యింది. బుధవారం హోరాహోరీగా సాగిన తొలి టీ20లో ఆసీస్ 6 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 216 పరుగుల లక్ష్యఛేదనలో చివరి ఓవర్‌లో విజయానికి ఆసీస్‌కు 16 పరుగులు అవసరమయ్యాయి. ఈ దశలో కెప్టెన్ మిచెల్ మార్ష్ (72 నాటౌట్), టిమ్ డేవిడ్ (31 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. మొదటి మూడు బంతులు సింగిల్స్‌కే పరిమితమైన ఆసీస్ బ్యాటర్లు..నాలుగో బంతిని డేవిడ్ భారీ సిక్స్‌గా మలిచాడు. ఐదో బంతికి రెండు పరుగులు రాగా, చివరి బంతిని డేవిడ్ ఫోర్ కొట్టి జట్టును గెలుపు సంబురాల్లో నింపాడు. సాంట్నర్ (2/42)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత రచిన్ రవీంద్ర (68), కాన్వే (63) అర్ధసెంచరీలతో కివీస్ 215/3 స్కోరు చేసింది. స్టార్క్, కమిన్స్, మార్ష్ ఒక్కో వికెట్ తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న మార్ష్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

హితేశ్ స్వర్ణ జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండోర్ వేదికగా జరుగుతున్న యూటీటీ జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర ప్యాడ్లర్ హితేశ్ దోల్వాని పసిడి పతక జోరు కనబరిచాడు. బుధవారం జరిగిన మూడు వేర్వేరు విభాగంలో హితేశ్ స్వర్ణ పతకాలతో మెరిశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో హితేశ్ 6-11, 12-10, 11-6, 11-9తో విశ్వ తాంబెపై గెలిచాడు. అదే దూకుడు కొనసాగిస్తూ డబుల్స్‌లో హితేశ్, కునాల్ అరోరా జోడీ 11-8, 4-11, 11-9, 6-11, 14-12తో దత్త ప్రసాద్, రవీంద్ర ద్వయంపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ఈ పారా ప్యాడ్లర్ విజేతగా నిలిచాడు.

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా శుక్రవారం నుంచి డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ మొదలుకాబోతున్నది. ఐదు జట్లతో జరుగబోతున్న లీగ్‌లో మహిళా క్రికెటర్లు సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. బుధవారం అన్ని జట్ల కెప్టెన్లు ట్రోఫీతో కలిసి ఫొటో షూట్‌లో ల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.